ఎమర్జింగ్ కెరియర్

**'మీకు పది లక్షల రూపాయల లాటరీ తగిలింది' అని ఒక సేవా సంస్థ పంపిన ఈ-మెయిల్ చూసిన అఖిల్ ఆనందానికి అవధుల్లేవు. వ్యక్తిగత, బ్యాంకుఖాతా వివరాలు మెయిల్‌లో ఇచ్చిన లింక్‌లో నమోదు చేసి, ప్రాసెసింగ్ ఫీజు కింద రూ. 1000 ఫలానా అకౌంట్‌కు పంపమని ఆ ఎలక్ట్రానిక్ సందేశ సారాంశం. అరగంటలో ఆ పని పూర్తిచేసేశాడు. ఇక వచ్చే డబ్బుతో ఏం చేయాలో ప్లాన్లు వేయడం మొదలుపెట్టాడు.**

**మరుసటి రోజు మొబైల్‌కి ఒక ఎస్ఎంఎస్ వచ్చింది. తన బ్యాంకులోని సొమ్మంతా ఏదో రాష్ట్రంలోని, ఎవరిదో ఖాతాలోకి జమ అయినట్లు. గుండె జారిపోయింది. బ్యాంక్‌కి పరుగులు తీశాడు. అంతా ఆన్‌లైన్‌లో జరిగిపోయింది. తామేమీ చేయలేం, పోలీసులను సంప్రదించమని సిబ్బంది చెప్పారు. వస్తుందో, రాదో తెలియని డబ్బు కోసం అదేపనిగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు అఖిల్.**

**ఆధునిక టెక్నాలజీ ద్వారా అన్ని పనులు ఆన్‌లైన్‌లో సులువుగా జరిగిపోతున్నప్పటికీ సమాచారానికి భద్రత లేకుండా పోయింది. దీంతో ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ అనేది ఎన్నో రకాల ఉద్యోగాల, కోర్సుల ఆవిర్భావానికి కారణమైంది. ఇప్పుడు వేగంగా విస్తరిస్తోంది.**



# ఇప్పుడు ట్రెండింగ్ ఇన్ఫోసెక్!

కంప్యూటర్ టెక్నాలజీ, నెట్‌వర్క్‌ల సంయోగం ద్వారా సమాచారాన్ని క్షణాల్లో సరఫరా చేయడం సాంకేతికంగా ఒక విప్లవాత్మక మార్పు. కానీ ఆ సౌలభ్యంతోపాటు అనేక రకాలుగా టెక్నాలజీ దుర్వినియోగం అవుతోంది. అందుకే ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది.

### ››› ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అంటే ఏమిటి?

'ఇన్ఫోసెక్' అనే చిట్టి పేరు కలిగిన ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ, డిజిటల్ రూపంలో ఉన్న సమాచారాన్ని భద్రపరచడానికి అవసరమైన పద్ధతులను అన్వేషిస్తుంది. వాటిని గుర్తించి, అభివృద్ధి చేస్తుంది. అంటే అనధికారికంగా సమాచారాన్ని సంగ్రహించడం, వినియోగించడం, ఇతరులకు పంపిణీ చేయడాన్ని నివారిస్తుంది. అనైతిక, చట్ట విరుద్ధమైన చర్యల నుంచి సమాచారానికి రక్షణ కల్పిస్తుంది.

సమాచారం లేదా డేటా ఎలాంటి పరికరంలోనైనా ఉండవచ్చు. ఈ రక్షణ ప్రక్రియలో సీఐఏ అనే మూడు మౌలికాంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. వీటిలో 'సి' (కాన్ఫిడెన్షియాలిటీ) సమాచార గోప్యతకు, 'ఐ' (ఇంటిగ్రిటీ) సమాచార సమగ్రతకు, 'ఎ' (అవైలబిలిటీ) సమాచార లభ్యతకు సూచికలు. గోప్యత అంటే అర్హత లేనివారికి సమాచారం లభించకుండా చేయడం, సమగ్రత అంటే రవాణా ప్రక్రియలో సమాచారం ఎక్కడ ఎలాంటి మార్పులకూ గురికాకుండా ఉండటం. మూడోదైన లభ్యత అంటే కోరుకున్న సమయానికి సమాచారం అందుబాటులో ఉండటం. ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ ఈ మూడు మౌలికాంశాలను లక్ష్యాలుగా పరిగణిస్తుంది. వాటికి హామీ ఇచ్చే అల్గారిథమ్‌ను (క్రమ సూత్ర పద్ధతులు), ప్రోగ్రామ్‌లను అభివృద్ధి పరుస్తుంది. సమాచార భద్రత స్థాయుల గురించి పటం ద్వారా తెలుసుకోవచ్చు.




### ›››డిజిటల్ సమాచారం ఎంత భద్రం?

కంప్యూటర్లలో సమాచారానికి పూర్తి భద్రత ఉంటుందనుకోవడం భ్రమ. అల్గారిథమ్, దాని ఆధారంగా రాసిన ప్రోగ్రామ్‌లకు సంభావ్యతా సిద్ధాంతం ఆధారంగా ఉంటుంది. కాబట్టి వాటి వివరాలను గణితాన్ని ఉపయోగించి ఇతర మార్గాల ద్వారా తెలుసుకోవచ్చు. భద్రతా వలయాన్ని ఛేదించవచ్చు. అందుకే కంప్యూటర్ లేదా డిజిటల్ వ్యవస్థలో సంపూర్ణ భద్రత అసాధ్యం. అందుకే వీలైనంత తక్కువ సమయంలో ఆన్‌లైన్ వ్యవహారాలు ముగించడానికి పాస్‌వర్డ్‌లతోపాటు వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) వంటి వాటిని వాడుతున్నారు.

### ››› ఉప రంగాలు - నైపుణ్యాలు

ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీకి సంబంధించిన నైపుణ్యాలను ప్రధానంగా ఈ కింది ఉప రంగాలుగా లేదా ప్రత్యేకాంశాలుగా నేర్చుకోవాల్సి ఉంటుంది.

**ఇంటర్‌నెట్ సెక్యూరిటీ:** అంతర్జాలంలో సమాచార భద్రతకు సంబంధించిన మెలకువలు, నైపుణ్యాలను అభ్యర్థులు నేర్చుకుంటారు. ముఖ్యంగా రవాణాలో ఉన్న సమాచారానికి రక్షణ ఇవ్వడం, ఆటంకాలు లేకుండా చేయడం వీరి కర్తవ్యం.

**సైబర్ సెక్యూరిటీ:** ఇంటర్‌నెట్ వేదికగా ఇతరుల సమాచారంపై దాడి, ధ్వంసం చేయడం వంటి వాటి నుంచి భద్రత కల్పించే మెలకువలు, నైపుణ్యాలను ఈ అభ్యర్థులు నేర్చుకుంటారు. అత్యధిక ఉద్యోగావకాశాలు ఉన్న రంగం ఇది.



**నీలమేఘశ్యామ్ దేశాయ్**
ACE ఇంజినీరింగ్ కళాశాల

**కంప్యూటర్ సెక్యూరిటీ:** ఈ ఉప రంగంలో రవాణాలో లేని లేదా కంప్యూటర్‌లో నిక్షిప్తమై ఉన్న సమాచారానికి నిపుణులు రక్షణ ఇస్తారు. పటిష్ఠమైన పాస్‌వర్డ్‌ల అభివృద్ధి, ఆథెంటికేషన్, యాక్సెస్ కంట్రోల్ వంటి సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణ ఉంటుంది. వైరస్‌ల వల్ల సమాచార సమగ్రతకు ముప్పు ఏర్పడకుండా యాంటీ వైరస్ ప్రోగ్రామ్‌లను పెంపొందించడం నేర్చుకుంటారు.

**మొబైల్ సెక్యూరిటీ:** ఈ రంగంలోనే సమాచారానికి ఎక్కువగా భద్రత లేకుండా పోయింది. మొబైల్ ద్వారా అన్ని సౌకర్యాలు కలుగుతున్నప్పటికీ, మొబైల్ నంబర్ ఇంటర్‌నెట్‌లో అందిరికీ అందుబాటులో ఉండటంతో భద్రత ఇబ్బందికరంగా మారింది. అందుకే అభ్యర్థులకు మొబైల్ ఆధారిత సేవలను ఉపయోగించడం, ఇతర టూల్స్, యాప్‌ల అభివృద్ధికి కావాల్సిన నైపుణ్యాలను నేర్పిస్తారు.

**నెట్‌వర్క్ సెక్యూరిటీ:** కంప్యూటర్ నెట్‌వర్క్‌లను చొరబాటుదారుల నుంచి రక్షించడానికి అవసరమైన టూల్స్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ఉపకరణాల అభివృద్ధి గురించి ఈ రంగంలో నేర్చుకుంటారు. ఫైర్ వాల్, రౌటర్ వంటి టెక్నాలజీల అభివృద్ధి, నిర్మాణం, వినియోగం, నిర్వహణ ఈ రంగానికి సంబంధించినదే.

### ››› అనేక దారుల్లో అభద్రత

సమాచారానికి రకరకాల మార్గాల్లో ప్రమాదం వాటిల్లుతుంది.



- ✤ వివిధ వైరస్‌లతో సాఫ్ట్‌వేర్‌ను ధ్వంసం చేయడం
- ✤ మేధో సంపత్తిని దొంగిలించడం
- ✤ పాస్‌వర్డ్ ఆనవాళ్లను సంగ్రహించడం
- ✤ సమాచారాన్ని అనుమతి లేకుండా సేకరించడం
- ✤ సమాచారాన్ని ధ్వంసం చేయడం
- ✤ ఫిషింగ్ (మన ప్రమేయం లేకుండానే ఈ-మెయిల్‌ను సంపాదించి పదే పదే మెయిల్స్ పంపడం)

ఇవే కాకుండా, రోజురోజుకీ కొత్త పద్ధతుల్లో సమాచారానికి ప్రమాదం కలిగిస్తున్నారు. వీటన్నింటినీ ఎదుర్కొనే ప్రక్రియలోనే అనేక రకాల ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయి.

### ››› ముఖ్యమైన సర్టిఫికేషన్‌లు

- ఎథికల్ హ్యాకింగ్ (సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్)
- సిస్కో నెట్‌వర్కింగ్ (సీసీఎన్ఏ)
- మైక్రోసాఫ్ట్ సంస్థ ద్వారా ఎంసీఎస్ఈ సర్టిఫికెట్ కోర్సు
- ఇసాకా సంస్థ ద్వారా సర్టిఫైడ్ సెక్యూరిటీ అనలిస్ట్.

## ఎలాంటి ఉద్యోగాలు?

మన నిర్లక్ష్యం, అలసత్వాల వల్లే సమాచారానికి ప్రమాదం ఏర్పడుతుంది. అందుకే భద్రత కల్పించే ఉద్యోగులు పలు అంశాల్లో నైపుణ్యాన్ని సంపాదించాలి. సంస్థ రక్షణ నియమాలు, ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ నిర్వహణ, సమాచార ఆస్తుల రక్షణ, మానవ వనరుల భద్రత, ఆథెంటికేషన్, సమాచార సేకరణ-నిర్వహణ వివరాలు, చట్టపరమైన జాగ్రత్తల వంటి అంశాల పట్ల పూర్తి అవగాహనతో ఉండాలి. కొన్నేళ్లుగా ఈ రంగంలో ఏటా దాదాపు 20 % పైగా ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. 2024 వరకూ ఇదే రీతిన వృద్ధి ఉంటుందని ఒక సర్వే వెల్లడైంది.

ఈ రంగంలో ఉండే ఉద్యోగాల్లో కొన్ని...



■ నెట్‌వర్క్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేటర్ ■ సిస్టమ్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేటర్ ■ నెట్‌వర్క్ సెక్యూరిటీ ఇంజినీర్ ■ డేటా అనలిస్ట్ ■ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ సెక్యూరిటీ మేనేజర్

## ఎవరు అర్హులు?

వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రంగంలో కెరియర్‌ను కోరుకుంటే ఈ కింది అర్హతలు ఉండాలి.

- ▌ కనీసం డిగ్రీ. ఇంజినీరింగ్ అయితే ప్రాధాన్యం.
- ▌ అల్గారిథమ్, ప్రోగ్రామ్‌లు అభివృద్ధి చేయాలంటే గణితంలో నంబర్ థియరీ తెలిసి ఉండాలి. క్రిప్టోగ్రఫీ వంటి కొన్ని విభాగాల్లో 300 పైగా అంకెలున్న ప్రైమ్ నంబర్స్‌తో రిమైండర్ అరిథ్‌మెటిక్ థియరీపై ఆధారపడిన లెక్కలు ఉంటాయి. రింగ్స్, ఫీల్డ్స్ వంటి పాఠ్యాంశాలపై పట్టు ఉండాలి.
- ▌ ప్రయోగశాలల్లో అభ్యాసం చేసి మెలకువలు పెంపొందించుకోవాలి.
- ▌ ఈ రంగంలో ఒకటి లేదా రెండు ప్రాజెక్టులు చేసి ఉండటం మంచిది.
- ▌ లినక్స్, యూనిక్స్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌ల నిర్మాణంపై మంచి పట్టు ఉండాలి.
- ▌ ఆన్‌లైన్ సర్టిఫికేషన్

**అదనంగా...**

- ✦ ఈ రంగంలో ఇతరులతో సత్సంబంధాలు
- ✦ సదస్సుల్లో పాల్గొనడం
- ✦ చేరాలనుకుంటున్న సంస్థ పనితీరు పట్ల సమగ్ర అవగాహన
- ✦ గాఢమైన అభిరుచి
- ✦ నిరంతర విద్యార్థిగా మెలగడం
- ✦ ఇతరులతో సహకరించగలిగే తత్వం ఉండాలి.

---

టీఆర్‌టీ - తెలుగు మెథడాలజీ

# తెలుగు బోధనలో మార్కుల సాధన!



**తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ కొలువులను ఆశించేవారు సన్నద్ధతలో నిమగ్నమైవున్నారు. భాషోపాధ్యాయ నియామక పరీక్షలో భాషాబోధన శాస్త్రం (తెలుగు) కీలకపాత్ర పోషిస్తుంది. ముందుగా సిలబస్‌ను ఆకళింపు చేసుకుని, ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. 'తెలుగు మెథడాలజీ'లో అధిక మార్కులు సాధించే మార్గాలు ఇవిగో!**

తెలుగు మెథడాలజీలో గరిష్ఠ మార్కులు సాధించడానికి పటిష్ఠ ప్రణాళిక అవసరం. సిలబస్‌లో ఏ అంశాలుంటాయి? ఏ పుస్తకాలు దానికి దోహదపడతాయి? గత ప్రశ్నల సరళి ఏమిటి?... ఈ సందేహాల నివృత్తికి ముందుగా 'సిలబస్'పై అవగాహన ఏర్పరచుకోవాలి.

స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), భాషోపాధ్యాయులు (LP) ఇద్దరి మెథడాలజీ సిలబస్‌ను విశ్లేషిద్దాం.

**1. భాష – వివిధ భావనలు:** ఇది సుదీర్ఘ అధ్యాయం. ఈ అధ్యాయంలో అతిముఖ్యమైన అంశం- ప్రథమభాషగా తెలుగు బోధనోద్దేశాలు, లక్ష్యాలు, స్పష్టీకరణలతోపాటు కనీస అభ్యసన స్థాయిలు, ద్వితీయ భాషగా తెలుగును ఎలా బోధించాలో చదవాల్సి ఉంటుంది. ఈ అధ్యాయం నుంచి ప్రశ్నలు ఎక్కువగా అడగడం రివాజు.

**ఉదా:** 1. మ్యాక్స్ ముల్లర్ ప్రతిపాదించిన భాషావాదం 1) ధ్వన్యనుకరణ సిద్ధాంతం 2) ధాతుజన్య వాదం 3) డింగ్‌డాంగ్ వాదం 4) భగవద్దత్త వాదం
**జవాబు:** 3

**2. భాషానైపుణ్యాలు:** ఈ అధ్యాయం పూర్తిగా అవగాహనకు సంబంధించింది. దీనిలో శ్రవణ, భాషణ, పఠన, లేఖనాలనే నాలుగు భాషా నైపుణ్యాలను ఆకళింపు చేసుకోవలసి ఉంటుంది. వీటి అంతర్గత సంబంధాలనూ ప్రత్యేక దృష్టి కోణంలో చూడాల్సి ఉంటుంది. ఈ అధ్యాయంలోని 'భాషణం'లో భాగంగా వాగుత్పత్తి, వాగింద్రియ నిర్మాణం, వర్ణోచ్చారణ స్థానాలు- వాగ్దోషాలు, వాటి నివారణోపాయాలను లోతుగా చదవాల్సి ఉంటుంది.

**3. ప్రణాళికా రచన–పాఠ్యగ్రంథాలు:** ఈ అధ్యాయాన్ని రెండు విభాగాలుగా చదవాల్సి ఉంటుంది. మొదటి దానిలో ప్రణాళికల్లో రకాలైన విద్యాప్రణాళిక, మౌలిక విద్యా ప్రణాళిక, పాఠ్య (విషయ) ప్రణాళిక, వార్షిక ప్రణాళిక, యూనిట్ ప్రణాళికతోపాటు పాఠ్యపథకాన్ని ఎలా సిద్ధం చేసుకోవాలో ఆకళింపు చేసుకోవాల్సి ఉంటుంది.

రెండో భాగంలో పాఠ్యపుస్తకాలైన ప్రధాన వాచకం- నిర్మాణ సూత్రాలు, పాఠ్యపుస్తకాల జాతీయీకరణ, ఉపవాచకం, కృషి పుస్తకం, ఆధ్యాత్మికదర్శిని మొదలైన అంశాలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ అధ్యాయం నుంచి అన్వయ ప్రశ్నలకు అవకాశం తక్కువ.



**సూరె శ్రీనివాసులు**

**4. విద్యా సాంకేతిక శాస్త్రం – సహపాఠ్య కార్యక్రమాలు:** ఈ అధ్యాయాన్ని రెండు భాగాలుగా విభజించుకుని చదవాల్సి ఉంటుంది. మొదటి భాగం బోధనోపకరణాల్లో రకాలైన శ్రవ్య, దృశ్య, దృశ్య శ్రవ్య బోధనోపకరణాలను పరిశీలనా దృష్టితో చదవాలి. ఒక్కోసారి ఈ విభాగం నుంచి కఠిన ప్రశ్నలు అడుగుతుంటారు.

రెండో భాగమైన సహపాఠ్య కార్యక్రమాల్లో భాగంగా భాషాక్రీడలు, వక్తృత్వం- ఉక్తరచన, వ్యాసరచన, పత్రిక నిర్వహణ, భాషా విహారయాత్రలు, సారస్వత సంఘాలు, గ్రంథాలు, పఠనాలయాలు, పరామర్శ గ్రంథాలు, మూల గ్రంథాల గురించి స్థూలంగా చదవాలి.

**5. సాహిత్య ప్రక్రియలు – బోధనాపద్ధతులు:** మెథడాలజీలో కీలకమైన అధ్యాయం ఇది. అన్వయ ప్రశ్నలకు అవకాశమిచ్చే అధ్యాయం కూడా. విస్తృతమైనది. దీనిలో పద్య బోధన, గద్య బోధన, వ్యాకరణ బోధన, వ్యాస బోధన, ఉపవాచక బోధన, కథా బోధన, నాటక బోధనలతోపాటు ఆధునిక ధోరణులైన క్రీడ, కిండర్ గార్టెన్, మాంటిసోరి, ప్రాజెక్టు, డాల్టన్, కృత్యాధార, నాటకీకరణ పద్ధతులను అధ్యయనం చేయాల్సివుంటుంది. ఈ అధ్యాయాన్ని సూక్ష్మంగా చదివితే ప్రశ్నలకు సమాధానాలను గుర్తించవచ్చు. ఈ అధ్యాయంలోని మరో అంశం- బోధన నైపుణ్యాలు. ఇందులో భాగంగా కార్యక్రమయుత బోధన, బృంద బోధన, సూక్ష్మ బోధనలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. వీటిపై ప్రశ్నలను అన్వయాత్మకంగా ఇవ్వటానికి అవకాశం ఉంది.

**6. మూల్యాంకనం:** ఒక పనిని చేసిన తర్వాత అది ఎంతవరకూ ఫలవంతమైందో తెలుసుకొనే అధ్యాయమిది. దీనిలో నికష, పరీక్ష, పరిగణన, మదింపు, మూల్యాకనం అనే భావనలు, వాటి తారతమ్యాల గురించి సూక్ష్మంగా గ్రహించాల్సి ఉంటుంది.

నిరంతర సమగ్ర మూల్యాంకనం (C-CE) లో భాగంగా నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ప్రశ్నా రూపాలైన వ్యాస రూప, లఘూత్తర, అతి లఘూత్తర, లక్ష్యాత్మక ప్రశ్నలపై ప్రత్యేక దృష్టి పెట్టవలసి ఉంటుంది.

## సన్నద్ధత ఎలా?

- ◆ గత డీఎస్సీ, టెట్ ప్రశ్నపత్రాల్లోని మెథడాలజీ ప్రశ్నల తీరుతెన్నులను ఆకళింపు చేసుకోవాలి.
- ◆ మొత్తం ఆరింటిలో 1, 5 అధ్యాయాలపై మరింత సాధన అవసరం.
- ◆ తెలుగు మెథడాలజీ అకాడమీ పుస్తకాలను క్షుణ్ణంగా చదవాలి.
- ◆ ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి.
- ◆ మాదిరి ప్రశ్న పత్రాలను సాధన చేయాలి.
- ◆ మెథడాలజీ నుంచి 32 ప్రశ్నలు వస్తాయి. 16 మార్కులు. నోట్సును సిద్ధం చేసుకోవాలి.
- ◆ అనువర్తిత ప్రశ్నలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి.
- ◆ కంటెంట్‌తో అనుసంధానం చేసుకుంటూ మెథడాలజీని చదవాల్సి ఉంటుంది.
- ◆ పాఠ్యపుస్తక నిర్మాణ సూత్రాలను చదివేటప్పుడు ప్రస్తుత పాఠ్యపుస్తక ఇతివృత్తాలతో అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది.
- ◆ ప్రస్తుతం అమలులో ఉన్న విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టిసారించాలి.
- ◆ నేడు మూల్యాంకనంలో వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకోవాల్సి ఉంటుంది.
- ◆ తెలుగు మెథడాలజీలోని యూనిట్లను వేరుగా భావించక ఒకదానితో ఒకటి సమన్వయం చేసుకుని చదవాలి.
- ◆ 'మాట్లాడేది తెలుగే కదా!' అని తాత్సారం చేయకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకెళితే విజయం తథ్యం!

## నోటీస్ బోర్డు

**ప్రభుత్వ ఉద్యోగాలు**

**ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్**
పోస్టు: కన్సల్టెంట్ ఖాళీలు: 02
అర్హత: పీజీ/ పీహెచ్‌డీ.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ తేది: 26.12.2017 దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
చివరి తేది: 22.12.2017 వెబ్‌సైట్: http://nird.org.in/

**పాండిచ్చేరి యూనివర్సిటీ**
పోస్టు: అడ్మినిస్ట్రేటివ్ పోస్టులు
ఖాళీలు: 03 అర్హత: పీజీ
ఎంపిక: నిబంధనల ప్రకారం
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్
చివరి తేది: 10.01.2018 వెబ్‌సైట్: www.pondiuni.edu.in

**వాక్ ఇన్ ఇంటర్వ్యూ**

**ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం**
పోస్టు: టెక్నికల్ అసిస్టెంట్ ఖాళీలు: 04
అర్హత: ఎంటెక్/ ఎంఎస్సీ ఇంటర్వ్యూ తేది: 18.12.2017 వెబ్‌సైట్: http://www.angrau.ac.in/

**సీఆర్ఐయూఎం, హైదరాబాద్**
పోస్టు: సీనియర్ రిసెర్చ్ ఫెలో
ఖాళీలు: 03
అర్హత: ఎంఎస్సీ/ ఎంయూఎంఎస్/ నెట్
ఇంటర్వ్యూ తేది: 11.01.2018
వెబ్‌సైట్: http://criumhyderabad.net/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**



# చదువు

## వైవిధ్య



ఏపీ టెట్

# టెట్... పోటీ పెరుగుతోంది!



**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని పాఠశాల విద్యాశాఖ 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష ' (ఏపీ టెట్–2017) ప్రకటనను విడుదల చేసింది. ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ)లో 20 శాతం వెయిటేజీ ఇస్తున్న నేపథ్యంలో టెట్ స్కోరుకు ప్రాధాన్యం పెరిగింది. ఈ పరీక్షకు పోటీ పెరగటం, ఆన్‌లైన్‌లో నిర్వహించబోవటం...తాజా మార్పులు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయ కొలువుకు మార్గం సుగమం చేసే టెట్‌లో మెరిసేందుకు... ఇవిగో– విలువైన సూచనలు!**

ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం టెట్ స్కోరును 7 సంవత్సరాల పాటు పరిగణనలోకి తీసుకుంటారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరగా 2014 మార్చిలో టెట్ నిర్వహించారు. పాత, ప్రస్తుత డీఈడీ, బీఈడీ అభ్యర్థులు చేరడంతో తాజా టెట్‌కు పోటీ అధికంగా ఉండబోతోంది. నవ్యాంధ్రప్రదేశ్‌లో మొదటి ఉపాధ్యాయ నియామక పరీక్షను టెట్‌తో కలిపి నిర్వహించిన ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ విడిగా నిర్వహించనుంది. అలాగే ఈసారి పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు.


శ్రీ అనూ పబ్లికేషన్స్ APTET BOOKS

❖ శ్రీ అనూ TET బుక్స్ చదివితే మీకు 115 to 120 వరకు మార్కులు వచ్చినట్లే!
❖ మార్కెట్లో లభ్యమగును
❖ TET-Paper-I All in One (Two Volumes)
❖ TET-Paper-II - All in One (Two Volumes)
❖ మోడల్ పేపర్స్ - I & II
❖ చైల్డ్ డెవలప్‌మెంట్ - పూర్ణచంద్రరావు, శివపల్లి.
❖ కోచింగ్ సెంటర్స్‌కి కూడా సప్లై చేయబడును.
సెల్: 9490750137, 9949197217


1-5 తరగతుల బోధనకు పేపర్-1; 6-8 తరగతుల బోధనకు పేపర్-2లో అర్హత సాధించాల్సి ఉంటుంది.

## ఎలా సన్నద్ధం కావాలి?

సిలబస్ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. పేపర్ 1 రాసే అభ్యర్థులు శిశువికాసం, పెడగాజీ కోసం డీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాలతోపాటు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ఇంటర్నెట్, ప్రామాణిక మెటీరియల్‌ను అనుసరిస్తే పోటీలో ముందుంటాం. చదివేటప్పుడు బిట్ల రూపంలో కాకుండా పాఠ్యాంశం మొత్తాన్ని విశ్లేషించుకుంటూ సాగాలి.

➤ గత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయాలి. ఒక్కో చాప్టర్ నుంచి ఎన్ని ప్రశ్నలు వస్తున్నాయో పరిశీలించాలి. అందుకు అనుగుణంగా మనం చదవబోయే సిలబస్ అంశాలను విభజించుకోవాలి. ఆయా అంశాల ప్రాధాన్యాల ప్రకారం సమయం కేటాయించుకోవాలి.

వాస్తవానికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఆర్‌టీ)లో కంటే టెట్‌లోనే కొంచెం క్లిష్టమైన ప్రశ్నలను అడుగుతున్నారు. జ్ఞానాన్ని పరీక్షించే ప్రశ్నలే కాకుండా అవగాహన, అనుప్రయుక్తం, తరగతి గది అన్వయం, నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలను సంధిస్తున్నారు.

➤ శిశువికాసంలో ప్రధానంగా శిశు వికాసం, వైయక్తిక భేదాలు, వైఖరులు, అభిరుచులు, ప్రజ్ఞ, మూర్తిమత్వ వికాసం, రక్షక తంత్రాలు... అలాగే అభ్యసనం అధ్యాయంలో అభ్యసన సిద్ధాంతాలు, ప్రేరణ, స్మృతి, విస్మృతి, అభ్యసన బదలాయింపు అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇక పెడగాజీ విభాగంలో ప్రత్యేక అవసరాల పిల్లలు- సహిత విద్య, వైయక్తిక- సామూహిక అభ్యసనం- స్వయం అభ్యసన, బోధనలోని దశలు- అభ్యసన వనరులు- మార్గదర్శకత్వం- మంత్రణం, సీసీఈ, ఎన్‌సీఎఫ్-2005, ఆర్‌టీఈ-2009 అంశాలను చేర్చారు.



డా.వి.బ్రహ్మం

* తెలుగు సబ్జెక్టులో పఠనావగాహన, తెలుగు సాహిత్యం, సంస్కృతి, భాషాంశాలు అధ్యయనం చేయాలి. బోధనా పద్ధతుల్లో తెలుగు అకాడమీ పుస్తకాలను అనుసరించడం ఉత్తమం.

➤ ఇంగ్లిష్‌కు సంబంధించి 10వ తరగతి స్థాయిలోని వ్యాకరణంపై పూర్తి అవగాహన అవసరం. ఎక్కువగా మాదిరి ప్రశ్నపత్రాలు సాధన చేసి, విషయంపై సమగ్ర అవగాహన పొందాలి.

➤ గణితంలో నాన్ మ్యాథ్స్ అభ్యర్థులు (ఇంటరులో బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ చదివినవారు) ఆందోళన చెందాల్సిన పనిలేదు. 10వ తరగతి వరకు వారు గతంలో చదివినవే కాబట్టి ప్రాథమికాంశాలను పునశ్చరణ చేసినట్లు భావిస్తే, మంచి మార్కులు సాధించవచ్చు.

➤ పరిసరాల విజ్ఞానానికి సంబంధించిన అంశాల కోసం ప్రామాణిక పుస్తకాలను అధ్యయనం చేయాలి. తరగతి గది పరిస్థితులకూ, నిత్యజీవిత అంశాలకూ అన్వయించుకుని తయారవ్వాలి.

➤ మెథడాలజీ అంశాల విషయంలో గణితం, పరిసరాల విజ్ఞానాల మధ్య సారూప్యం ఉంటుంది. ఆయా సబ్జెక్టుల్లోని ఉమ్మడి అంశాలను గమనించి సన్నద్ధత కొనసాగిస్తే సమయం ఆదా అవుతుంది.

## పునశ్చరణకు పనికొచ్చే నోట్సు

✤ ప్రాథమికాంశాలపై పూర్తి పట్టు సాధించాలి.

✤ గత ప్రశ్నపత్రాల ఆధారంగా ప్రధానాంశాలపై దృష్టి సారించాలి. కచ్చితంగా వస్తుందన్న అంశాన్ని స్పష్టంగా, విశ్లేషణాత్మకంగా నేర్చుకోవాలి.

✤ సబ్జెక్టుపై ఆసక్తితో.. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సన్నద్ధతను విరమించకుండా ప్రేరణతో కొనసాగించాలి.

✤ తెలిసిన విషయాలతో తెలియని అంశాలను సమన్వయం చేసుకుంటూ అధ్యయనం చేయడం మంచిది.

✤ అభ్యసన సమయంలోనే నోట్సు రాసుకోవడం ఉత్తమం. పునశ్చరణకు ఇది ఉపకరిస్తుంది.

✤ మాదిరి ప్రశ్నలు సాధన చేసిన తర్వాత సవరణాత్మక అభ్యసనం కొనసాగించాలి.

## ప్రశ్నపత్రం స్వరూపం

| పేపర్ 1 అంశం | మార్కులు |
|---|---|
| 1. శిశు వికాసం, బోధనాశాస్త్రం | 30 మా. |
| 2. భాష 1 (తెలుగు) (కంటెంట్, మెథడాలజీ) | 30 మా. |
| 3. భాష - 2 (ఇంగ్లిష్) (కంటెంట్, మెథడాలజీ) | 30 మా. |
| 4. గణితం (కంటెంట్, మెథడాలజీ) | 30 మా. |
| 5. పరిసరాల విజ్ఞానం (కంటెంట్, మెథడాలజీ) | 30 మా. |
| మొత్తం | 150 మా. |

| పేపర్ 2 అంశం | మార్కులు |
|---|---|
| 1. శిశు వికాసం, బోధనాశాస్త్రం | 30 |
| 2. భాష 1 (తెలుగు) (కంటెంట్, మెథడాలజీ) | 30 |
| 3. భాష - 2 (ఇంగ్లిష్) (కంటెంట్, మెథడాలజీ) | 30 |
| 4. మ్యాథమేటిక్స్ అండ్ సైన్స్/ సోషల్ స్టడీస్ (కంటెంట్, మెథడాలజీ) | 60 |
| మొత్తం | 150 |

# నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

**ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్**
**పోస్టు:** కన్సల్టెంట్ **ఖాళీలు:** 02
**అర్హత:** పీజీ/ పీహెచ్‌డీ.
**ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
**ఇంటర్వ్యూ తేది:** 26.12.2017 **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
**చివరి తేది:** 22.12.2017 **వెబ్‌సైట్:** http://nird.org.in/

**పాండిచ్చేరి యూనివర్సిటీ**
**పోస్టు:** అడ్మినిస్ట్రేటివ్ పోస్టులు
**ఖాళీలు:** 03 **అర్హత:** పీజీ
**ఎంపిక:** నిబంధనల ప్రకారం
**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
**చివరి తేది:** 10.01.2018 **వెబ్‌సైట్:** www.pondiuni.edu.in

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

**ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం**
**పోస్టు:** టెక్నికల్ అసిస్టెంట్ **ఖాళీలు:** 04
**అర్హత:** ఎంటెక్/ ఎంఎస్సీ **ఇంటర్వ్యూ తేది:** 18.12.2017 **వెబ్‌సైట్:** http://www.angrau.ac.in/

**సీఆర్ఐయూఎం, హైదరాబాద్**
**పోస్టు:** సీనియర్ రిసెర్చ్ ఫెలో
**ఖాళీలు:** 03
**అర్హత:** ఎంఎస్సీ/ ఎంయూఎంఎస్/ నెట్
**ఇంటర్వ్యూ తేది:** 11.01.2018
**వెబ్‌సైట్:** http://criumhyderabad.net/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**